సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 26 । ఫిబ్రవరి । 2025



టన్ను చీనీ రూ.22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.22 వేలు, కనిష్టంగా రూ.4 వేలు, సరాసరిన రూ.16 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.10

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.6 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 530 టన్నుల టమాట అమ్మకానికి వచ్చింది.



జిల్లా వ్యాప్తంగా మంగళవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలితీవ్రత తగ్గుతుండగా.. ఎండలు పెరుగుతున్నాయి. గంటకు 6 నుంచి 12 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

తగ్గిన ఎండు మిర్చి ధర



మార్కెట్‌కు వచ్చిన ఎండు మిర్చి

హిందూపురం అర్బన్: ఎండుమిర్చి ధర తగ్గింది. మంగళవారం హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు 61.40 క్వింటాళ్ల ఎండు మిర్చి రాగా, అధికారులు ఈ-నామ్ పద్ధతిలో వేలం పాట నిర్వహించారు. ఇందులో క్వింటా ఎండు మిర్చి గరిష్టంగా రూ.11 వేలు, కనిష్టంగా రూ.7 వేల ప్రకారం ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు. గత వారంతో పోలిస్తే క్వింటాపై రూ.500 మేర ధర తగ్గినట్లు వెల్లడించారు.

జాతీయ స్థాయిలో ధర్మవరం విద్యార్థి సత్తా

- ఐసీఎస్‌ఐ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 2వ ర్యాంకు



నితిన్ తేజ


ధర్మవరం అర్బన్: జాతీయ స్థాయి పరీక్షలో ధర్మవరం విద్యార్థి నితిన్ తేజ సత్తా చాటాడు. పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన ఉపాధ్యాయ దంపతులు సత్యనారాయణ, భవాని కుమారుడు పి.నితిన్ తేజ మంగళవారం విడుదలైన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్‌ఐ) ఫలితాల్లో ఆల్ ఇండియా 2వ ర్యాంకు సాధించాడు. దీంతో బంధువులు, పట్టణ ప్రముఖులు నితిన్ తేజను అభినందించారు.

ఉత్సవాలకు పకడ్బందీ బందోబస్తు



బందోబస్తుపై పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ రత్న

తాడిమర్రి: జిల్లాలోని వివిధ శైవ ఆలయాల్లో నిర్వహిస్తున్న శివరాత్రి ఉత్సవాలకు పకడ్బందీ బందోబస్తు చేపట్టినట్లు ఎస్పీ రత్న తెలిపారు. మంగళవారం ఆమె..డీఎస్పీ హేమంత్ కుమార్, ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యాంరావ్, సిబ్బందితో కలసి మండలంలోని చిల్లవారిపల్లి సమీపంలోని కాటికోటేశ్వర క్షేత్రాన్ని సందర్శించారు. ఆలయ పరిసరాలు, అన్నదాన సత్రం, విడిది గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని శైవ క్షేత్రాల్లో పటిష్ట బందోబస్తు చేపట్టామన్నారు. అనంతరం ఆమె... చిల్లవారిపల్లిలో పర్యటించారు. గ్రామస్తులతో సమావేశమయ్యారు. శివరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. ఉత్సవాలను అడ్డుకోవాలని చూసినా, ఘర్షణలకు పాల్పడాలని చూసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్పీ వెంట తాడిమర్రి, బత్తలపల్లి, ధర్మవరం రూరల్ ఎస్‌ఐలు కృష్ణవేణి, సోమశేఖర్, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఫిబ్రవరి 9: పెనుకొండలోని మారుతీ నగర్‌కు చెందిన ఆంజనేయులు (40) కుటుంబ పోషణ భారమై కొత్తగా నిర్మాణం చేపట్టిన ఇంట్లోనే ఉరి వేసుకుని తనువు చాలించాడు. అప్పుల్లో కూరుకుపోయి.. జీవితంపై విరక్తి చెంది.. అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తోంది.

ఫిబ్రవరి 12: లేపాక్షి మండలం కొండూరు గ్రామానికి చెందిన నరసింహమూర్తి (29) గ్రామ శివారున ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఓ మైక్రో ఫైనాన్స్ సంస్థలో అప్పు చేసి.. ద్విచక్ర వాహనం కొనుగోలు చేశాడు. ప్రతి నెలా కంతులు సక్రమంగా చెల్లించకపోవడంతో మైక్రో ఫైనాన్షియర్లు ఒత్తిడి తెచ్చాడు. దీంతో మనస్తాపానికి గురై ఊరికి దూరంగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు.

ఫిబ్రవరి 15: తనకల్లు మండలం పూలకుంటపల్లికి చెందిన రైతు చంద్రశేఖర్ (32) పొలంలో రెండు బోర్లు వేయించాడు. ఆ తర్వాత ట్రాక్టరు కొనుగోలు చేశాడు. మూడేళ్ల నుంచి పంటలు చేతికి రాక నష్టాల్లో కూరుకుపోయాడు. మైక్రో ఫైనాన్స్‌లో కూడా అప్పులు చేయగా...వారి నుంచి ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. అప్పులు తీర్చే మార్గం కానరాక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు.

ఫిబ్రవరి 19: ధర్మవరానికి చెందిన అశోక్ (35) అప్పుల బాధతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటుకల బట్టీ నడిపే అశోక్.. షేర్ మార్కెట్, ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పుల ఊబిలోకి కూరుకుపోయాడు. చివరకు ఇంటిని కూడా తాకట్టు పెట్టి రూ.8 లక్షలు తీసుకున్నాడు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడకపోవడం..అప్పులు తీర్చే మార్గం కనిపించక పోవడంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇల్లుకూడా తాకట్టులో ఉండగా ఆ కుటుంబానికి గూడు కూడా లేకుండా పోయింది.

ఆయువు తీస్తున్న అప్పు!

భారీగా పెరిగిన జీవన వ్యయం

- అంతకంతకూ తగ్గిపోతున్న ఆదాయం
- పేదలకు అరపైసా సాయం అందించని సర్కార్
- బతుకు భారమై.. అప్పుల ఊబిలోకి
- వడ్డీలు కట్టలేక.. అప్పు చెల్లించలేక ఆత్మహత్య
- రోడ్డున పడుతోన్న బాధిత కుటుంబాలు

క్యాష్ చేసుకుంటున్న మైక్రో ఫైనాన్షియర్లు

నిరుపేదల అవసరాలను ఆసరాగా చేసుకుని చాలామంది మైక్రో ఫైనాన్షియర్లు అమాయకులకు అప్పులు ఇచ్చి.. అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారు. రుణం తిరిగి చెల్లించలేని స్థితిలో ఉన్న వారి ఆస్తులు కూడా రాయించుకున్న ఘటనలు వెలుగు చూశాయి. ఫలితంగా అవమాన భారం భరించలేక.. అప్పులు తీర్చలేక పేదలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

సాక్షి, పుట్టపర్తి

అంతంతమాత్రంగానే ఆదాయం..పెరిగిన జీవన వ్యయం...మితిమీరిన అనవసర ఖర్చులు..ఆడంబరాలు..ఆన్‌లైన్ జూదాలు... వెరసి సామాన్యులు అప్పుల ఊబిలో చిక్కుకుపోతున్నారు. ఎంతగా ప్రయత్నించినా బయటపడే మార్గం కనిపించక... రుణదాతల ఒత్తిడి పెరిగి జీవితాలను అర్ధంతరంగా ముగిస్తున్నారు. అయినవారికి పుట్టెడు దుఃఖం మిగుల్చుతున్నారు. కుటుంబ యజమాని అర్ధంతరంగా తనువు చాలిస్తే ఆ ప్రభావం పిల్లల భవిష్యత్‌పై తీవ్రంగా చూపుతోంది. ఎంతోమంది చదువు ఆపేసి.. పనులకు వెళ్లి.. భవిష్యత్తును కోల్పోతున్నారు.

పేదల సంక్షేమాన్ని విస్మరించిన సర్కార్

గడిచిన ఐదేళ్లలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రతి నెలా.. ఏదో ఒక పథకం రూపంలో బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేసేది. ఆ డబ్బుతో నిరుపేదల అవసరాలు తీరేవి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిరుపేదల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గతంలో అందే అమ్మఒడి, రైతు భరోసా ఇప్పుడు అందడం లేదు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చే రోగాలు తగ్గిపోగా... ప్రైవేటు ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ అంటేనే చికిత్స చేయలేమంటున్నాయి. దీంతో పేదల కుటుంబాల్లో ప్రతి అవసరమూ అప్పుతో ముడిపడుతోంది. పిల్లల చదువులు, పంటకు పెట్టుబడులు.. రోగమొస్తే ఆస్పత్రి బిల్లులు అన్నింటికీ అప్పే. ఇలా అప్పు మీద అప్పులు చేస్తూ జీవనం నెట్టుకొస్తున్నారు. నిరుపేదలు రుణదాతల ఒత్తిడి పెరిగినప్పుడు దిక్కుతోచక బలవంతంగా ఆయువు తీసుకుంటున్నారు. ఇక చిన్న, సన్నకారు రైతులు పెట్టుబడుల కోసం అధిక వడ్డీలకు అప్పు తీసుకుంటున్నారు. సకాలంలో పంట అందకపోవడం.. వచ్చినా.. గిట్టుబాటు ధర లేకపోవడంతో అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారు. వడ్డీ కూడా కట్టలేని స్థితిలో.. ఫైనాన్షియర్ల వేధింపులు తాళలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

విలాసాలూ.. అలవాట్లూ కారణమే

ఆత్మహత్య చేసుకుంటున్న వారిలో విలాసాలు, చెడు అలవాట్ల కారణంగా అప్పుల ఊబిలోకి వెళ్తున్న వారూ ఉన్నారు. ఇరుగూపొరుగు వారితో పోల్చుకుంటూ.. లేనిపోని ఖర్చులకు వెళ్లడం.. ఖరీదైన ఫర్నీచర్, గృహోపకరణాలు కొనుగోలు చేయడం కారణంగా అప్పుల పాలవుతున్న వారు ఉన్నారు. తమ దగ్గర డబ్బు లేకున్నా.. బ్యాంకుల్లో రుణాలు తీసుకోవడం.. తెలిసిన వారి దగ్గర అప్పు చేయడం.. లేదంటే ఈఎంఐ పద్ధతిలో అప్పు చేసి వస్తువులు కొనుగోలు చేసి.. లేని పోని సమస్యలను మీదకు తెచ్చుకుని ప్రాణాలు కోల్పోతున్నారు. ఇంకొందరు జూదం బారిన పడి కూడా అప్పులు చేసి.. ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

ఆత్మహత్యల వివరాలు ఇలా..

ఏడాది	ఆత్మహత్య కేసులు	అప్పుల బాధతో బలవన్మరణం
2023	117	45
2024	99	63
2025 (ఇప్పటివరకు)	21	7

ఆత్మహత్య చేసుకుంటున్న వారిలో 40 శాతం మంది అప్పుల బాధతోనే బలవన్మరణం చెందుతున్నట్లు తేలింది.

ఆర్థిక క్రమశిక్షణ అవసరం

ప్రతి ఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణ అలవర్చుకోవాలి. ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకుని అప్పులు చేయాలి. ఏడాది పొడవునా ఉండే ఖర్చులను లెక్కవేసుకుని బడ్జెట్ ప్లాన్ చేసుకోవాలి. అలాగే అత్యవసర వినియోగానికి కొంతమొత్తాన్ని పక్కన పెట్టుకోవాలి. అత్యవసరమైతే తప్ప ఈఎంఐల కింద వస్తువులు కొనకూడదు. ఆదాయాన్ని అంచనా వేయడం చేతగాని వారే అప్పుల పాలవుతున్నారు. తీవ్ర ఒత్తిడికి గురై బలవన్మరణాలకు తెగిస్తున్నారు.

–రాధా కృష్ణారెడ్డి, ఆడిటర్, పుట్టపర్తి

దురాశతోనే దుఃఖం

కొందరు యువకులు సులువుగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో.. జూదానికి బానిస అవుతున్నారు. క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ పేకాట, మట్కా.. ఇలా అప్పులు చేసి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. తొలుత అలవాటుగా మారిన 'ఆట'... ఆ తర్వాత వ్యసనంగా మారుతుండగా... జీవితాలనే నాశనం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆస్తులమ్మినా అప్పులకు సరిపోయే పరిస్థితి లేక...సమాజంలో తలెత్తుకోలేక ఎంతోమంది ఆయువు తీసుకుంటున్నారు.

వేధిస్తే ఫిర్యాదు చేయండి



రాబడికి తగ్గట్టుగానే ఖర్చులు ఉండాలి. అత్యవసర సమయంలో మాత్రమే అప్పు చేయాలి. విలాసాలు...జూదాలు.. విందు వినోదాల కోసం అప్పు చేయకూడదు. ఖర్చులకు తగిన విధంగా ఆదాయ మార్గాలు ఎంచుకోవాలి. ఎక్కడైనా మైక్రో ఫైనాన్స్ వేధింపులు ఎక్కువైతే పోలీసుల దృష్టికి తీసుకురావాలి. – వి.రత్న, ఎస్పీ

రియల్టర్ రెడ్డెప్పశెట్టిపై కేసు

చిలమత్తూరు: చిత్రావతి నదిపై అక్రమంగా బ్రిడ్జి నిర్మించడంతో పాటు నదీ జలాలను ఇష్టానుసారం వాడుకుంటున్న రియల్టర్ రెడ్డెప్ప శెట్టిపై చిలమత్తూరు పోలీసులు కేసు నమోదు చేశారు. రియల్టర్ రెడ్డెప్ప శెట్టి ఆగడాలపై 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించగా జలవనరుల శాఖ అధికారులు స్పందించారు. చిత్రావతి నదిపై అక్రమంగా నిర్మించిన బ్రిడ్జిని ఈనెలాఖరులోపు తొలగించాలని నోటీసులిచ్చారు. ఆ గడువు సమీపిస్తుండటంతో మంగళవారం మరో అడుగు ముందుకు వేశారు. అనధికారికంగా నదిపై బ్రిడ్జి నిర్మాణాన్ని తీవ్రంగా పరిగణిస్తూ రియల్టర్ రెడ్డెప్ప శెట్టిపై కేసు నమోదు చేయాలని జలవనరులశాఖ ఏఈ నాగరత్న చిలమత్తూరు ఎస్‌ఐ మునీర్ అహ్మద్‌కు ఫిర్యాదు చేశారు. అదే విధంగా బ్రిడ్జి తొలగింపు సమయంలో ఎలాంటి ఆటంకాలు కలిగించకుండా గట్టి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు రియల్టర్ రెడ్డెప్ప శెట్టిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైతులతో స్టేట్‌మెంట్ రికార్డు

మరోవైపు రెడ్డెప్ప శెట్టి భూఆక్రమణలపై రెవెన్యూ అధికారులు విచారణ ముమ్మరం చేశారు. రెడ్డెప్పశెట్టి భూఆక్రమణలతో ఇబ్బందులు పడుతున్న రైతులను మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించారు. తమ పొలాలకు వెళ్లే దారి మూసివేసి రెడ్డెప్ప శెట్టి ఏ విధంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారో బాధిత రైతులు ఈ సందర్భంగా రాత పూర్వకంగా తెలిపారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్టు డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథ్ తెలిపారు.



రెడ్డెప్పశెట్టిపై చర్యలు తీసుకోవాలని చిలమత్తూరు పీఎస్‌లో ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు పత్రం

శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

- తిమ్మమాంబ చెంత భక్తజన సందోహం



రథంపై కొలువైన తిమ్మమాంబ అమ్మవారు



రథాన్ని లాగి ఉత్సవాలను ప్రారంభిస్తున్న దృశ్యం

ఎన్‌పీకుంట: తిమ్మమ్మమర్రిమాను వద్ద వెలసిన తిమ్మమాంబ ఆలయంలో మంగళవారం శివరాత్రి జాగరణ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు వైభవంగా నిర్వహించే ఉత్సవాలకు చుట్టుప్రక్కల ప్రాంతాలు, వైఎస్సార్, చిత్తూరు జిల్లాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

రథోత్సవంలో ఉత్సవాలు ప్రారంభం

మంగళవారం అమ్మవారి రథోత్సవంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. విద్యుత్‌దీప కాంతులతో సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంలో ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గుర్రప్ప, తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఎంపీడీఓ ఆంజినప్ప, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు రథం లాగి ఉత్సవాలను ప్రారంభించారు. తిమ్మమ్మమర్రిమాను, దిగువగూటిబైలు, ఎగువగూటిబైలు గ్రామాల్లో బాణసంచా పేలుస్తూ, కోలాటాలు ఆడుతూ అమ్మవారి రథాన్ని ఊరేగించారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ విష్ణుమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు వెంకటనారాయణ, శ్రీనివాసులు, నారాయణస్వామి, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు. కాగా, భక్తుల కాలక్షేపం కోసం ఆలయ కమిటీ సభ్యులు చెక్కభజనలు, తిమ్మమాంబ జీవిత చరిత్ర, బుర్రకథ ఏర్పాటు చేశారు.

అతిరుద్రం.. సంపూర్ణం

- పూర్ణాహుతితో ముగిసిన మహాయజ్ఞం

ప్రశాంతి నిలయం: విశ్వశాంతిని కాంక్షిస్తూ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ 11 రోజుల పాటు నిర్వహించిన అతిరుద్ర మహాయజ్ఞం మంగళవారం పూర్ణాహుతితో ముగిసింది. యజ్ఞ క్రతువుల్లో భాగంగా సాయికుల్వంత్ సభా మందిరంలో ప్రతిష్ఠించిన సాయీశ్వర లింగానికి రుత్వికులు పూజలు నిర్వహించారు. దేశవిదేశాలకు చెందిన వేలాది మంది భక్తులు మహాయజ్ఞంలో పాల్గొని తరించారు. మహాపూర్ణాహుతి కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు దంపతులు పాల్గొన్నారు. అనంతరం వివిధ నదుల నుంచి సేకరించి లింగాభిషేకం చేసిన జలాన్ని భక్తులపై సంప్రోక్షణ చేశారు. చివరి రోజు వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ టీఎస్ చేతన్, సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



పూర్ణాహుతి ఘట్టాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

నేటి నుంచి మహాశివరాత్రి వేడుకలు

ప్రశాంతి నిలయంలో బుధవారం నుంచి రెండు రోజుల పాటు మహాశివరాత్రి పర్వదిన వేడుకలు నిర్వహించనున్నారు. 26న ఉదయం 5 గంటలకు వేదపఠనంతో వేడుకలు ప్రారంభమవుతాయి. 5.20కి శివవందనం ఆధ్యాత్మిక భక్తిరస కార్యక్రమం నిర్వహిస్తారు. సాయంత్రం 4.25 గంటలకు కుల్వంత్ హాలులో సాయీశ్వరలింగం ఊరేగింపు, ఏకాదశ ద్రవ్యా భిషేకం, మహారుద్రాభిషేకం, సత్యసాయి అష్టోత్తర శత నామావళి పఠనం ఉంటుంది. 27వ తేదీ ఉదయం సుప్రభాతం, భజనలు ఉంటాయి. కాగా శివరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం సాయంత్రం 6 గంటల నుంచి ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో అఖండ భజన ప్రారంభమవుతుంది. గురువారం ఉదయం 6 గంటల వరకు నిర్విఘ్నంగా కొనసాగుతుంది.



సాయీశ్వరలింగానికి జలాభిషేకం చేస్తున్న రుత్వికుడు



ప్రత్యేక అలంకరణలో సత్యసాయి మహాసమాధి



గోపూజ నిర్వహిస్తున్న ఆర్‌జే రత్నాకర్ రాజు దంపతులు

పరిశ్రమల స్థాపనతోనే ఆర్థిక ప్రగతి

- కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: పరిశ్రమల స్థాపనతోనే ఆర్థిక ప్రగతి సాధ్యమని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత జిల్లా పరిశ్రమల శాఖ పనితీరుపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ... జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వపరంగా తగిన చేయూత ఇవ్వాలన్నారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలతో పాటు మహిళలకు ప్రభుత్వ మార్గదర్శకాలపై అవగాహన కల్పించి ఉత్పత్తి, సేవారంగాల్లో పరిశ్రమల స్థాపనకు వారిని పోత్సహించాలన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ స్థాపన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సకాలంలో అనుమతులు ఇవ్వాలన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపన అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులు, ఆమోదం పొందిన వాటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పీఎంఈజీపీ పథకం కింద వచ్చిన దరఖాస్తులను బ్యాంకులకు పంపాలన్నారు. జిల్లాలో నానో పార్కులు అభివృద్ధి చేయడానికి నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోనీ సహానీ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, ఎల్‌డీఎం రమణకుమార్, నాబార్డు ఏజీఎం అనురాధ, ఏపీ ఎఫ్‌ఎఫ్‌సీ ప్రకాష్, డికీ జోనల్ ప్రెసిడెంట్ కోలా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



పరిశ్రమల శాఖ పనితీరుపై సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్

సౌరనైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటుకు చర్యలు

జిల్లాలోని మడకశిర, కదిరి ప్రాంతాలు సౌర నైపుణ్య శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ చేతన్ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాలులో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 'డిస్ట్రిక్ట్ స్కిల్ కమిటీ మీటింగ్, 2025–26 సంవత్సరానికి సంబంధించి డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్లాన్‌పై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా యువతకు శిక్షణ ఇవ్వాలని, తద్వారా వారికి ఉపాధి కల్పించే దిశగా జిల్లా నైపుణ్యాభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలన్నారు.

ఆర్థిక క్రమశిక్షణతోనే అభ్యున్నతి

ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తేనే అభ్యున్నతి సాధ్యమవుతుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణ గురించి తెలుసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో డీఐఈపీసీ, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర వాటిపై అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆర్బీఐ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 24 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. వారోత్సవాల్లో భాగంగా విద్యాసంస్థలు, మహిళల పని ప్రదేశాల్లో ఆర్థిక అక్షరాస్యతపై పోటీలు నిర్వహించి నగదు బహుమతులు అందిస్తామన్నారు.

రేషన్ సరుకులు సకాలంలో అందించాలి

చౌకధరల దుకాణాల ద్వారా కార్డుదారులకు నిత్యావసరాలు సకాలంలో అందించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో ధరల పర్యవేక్షణ, నియంత్రణ కమిటీతో సమీక్షించారు. రైతు బజార్ల ద్వారా జిల్లా వ్యాప్తంగా 34 ప్రత్యేక కౌంటర్లు తెరిచి రోజు వారీగా వస్తువులు, నూనెలను విక్రయించాలని ఆదేశించారు. ప్రత్యేక కౌంటర్లలో కంది పప్పును విక్రయించాలన్నారు. ప్రభుత్వ చౌకధరల దుకాణాల్లో తూకాలు తేడాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

క్లుప్తంగా

ఈవీఎంల భద్రతపై నిరంతర నిఘా ఉండాలి

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్



గోదాముకు వేసిన సీల్‌ను పరిశీలిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

ధర్మవరం అర్బన్: ఈవీఎంలు భద్రపరిచిన గోదాముల వద్ద నిరంతరం సీసీ కెమెరా నిఘా, పటిష్ట భద్రత ఉండాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. ధర్మవరంలోని మార్కెట్ యార్డులో ఉన్న గోదాములో భద్ర పరిచన ఈవీఎంలను మంగళవారం ఆయన పరిశీలించారు. గోదాముల వద్ద భద్రతను, సెక్యూరిటీ లాగ్ బుక్‌ను పరిశీలించారు. సెక్యూరిటీ లాగ్ బుక్‌లో నమోదు చేసే వివరాలు స్పష్టంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఆర్డీఓ మహేష్, తహసీల్దార్ నటరాజ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

యువకుడి దుర్మరణం



వినోద్‌కుమార్ (ఫైల్)

ధర్మవరం అర్బన్: టిప్పర్ కిందపడి ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని శాంతినగర్‌కు చెందిన పెద్ద పోతలయ్య, అరుణ దంపతుల కుమారుడు వినోద్‌కుమార్(23) తన తండ్రి నిర్వహిస్తున్న బార్బర్ షాప్‌లో పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా నిలిచాడు. మంగళవారం బత్తలపల్లికి వెళ్లిన వినోద్‌కుమార్ సాయంత్రం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. ధర్మవరంలోని కదిరి గేట్ వద్దకు చేరుకోగానే వన్‌వే ట్రాఫిక్‌లో ఎదురుగా వెళుతున్న టిప్పర్‌ను ఓవర్ టేక్ చేస్తూ ముందుకు వెళ్లాడు. అయితే రోడ్డు పక్కనే ఉన్న బురదలో వాహనం స్కిడ్ కావడంతో అదుపు తప్పి కిందపడడంతో టిప్పర్ చక్రం అతని మీదుగా దూసుకెళ్లింది. ఘటనలో వినోద్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో వైఎస్సార్‌టీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి మృతి



ఇంద్రప్రసాద్ (ఫైల్)

నల్లచెరువు: వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ (వైఎస్సార్‌టీఏ) జిల్లా ప్రధాన కార్యదర్శి, నల్లచెరువు మండలం నడింపల్లి గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.ఇంద్రప్రసాద్(45) గుండెపోటుతో మృతి చెందారు. కదిరిలో నివాసముంటున్న ఆయన మంగళవారం సాయంత్రం గుండె పోటుకు గురి కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే బత్తలపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ లోపు పరిస్థితి విషమించి ఆయన కన్నుమూశారు. విషయం తెలుసుకున్న జిల్లా వైఎస్సార్‌టీఏ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

దళారుల ఎత్తు.. రైతుల చిత్తు!

- మడకశిరలో మార్కెట్ సౌకర్యం లేక అన్నదాతల అవస్థలు
- రూ.కోట్ల వాణిజ్య పంటలు ఇతర ప్రాంతాలకు తరలింపు
- అన్నదాతలను దగా చేస్తున్న దళారులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



మడకశిరలో నిరుపయోగంగా ఉన్న వ్యవసాయ మార్కెట్‌యార్డు

మడకశిర: జిల్లాలోనే మడకశిర నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయాధారిత ప్రాంతం. ప్రధానంగా వక్క, చింతపండు, తమలపాకు, పట్టుగూళ్లు, పూల ఉత్పత్తి అధికంగా ఉంది. ఇక్కడి రైతులను ఆర్థికంగా అంతో ఇంతో ఆదుకునే వాణిజ్య పంటలు కూడా ఇవేకావడం విశేషం. అయితే ఇంతటి ప్రాధాన్యత కలిగిన పంటలకు స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేకపోవడం రైతులకు శాపంగా మారింది. ఇదే అదునుగా చేసుకున్న దళారీలు అన్ని విధాలుగా రైతులను దగా చేసి లబ్ధి పొందుతున్నారు.

వక్కకు కర్ణాటక మార్కెట్లే దిక్కు..

నియోజకవర్గంలో 2 వేల హెక్టార్లలో వక్క తోటలు విస్తరించి ఉన్నాయి. దాదాపు 6 వేల మంది రైతులు వక్క తోటలపై ఆధారపడి జీవిస్తున్నారు. ఏటా దాదాపు రూ.10 కోట్ల విలువ చేసే వక్క ఉత్పత్తులకు స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేదు. దీంతో కర్ణాటక ప్రాంతంలోని మార్కెట్లకు వక్కను తరలించి రైతులు విక్రయిస్తున్నారు. అక్కడ దళారుల బెడద అధికంగా ఉండడంతో రైతులు నష్టాలు మూటగట్టుకుంటున్నారు. ఎన్నికల హామీలలో భాగంగానే అమరాపురం కేంద్రంగా వక్క మార్కెట్ ఏర్పాటు చేస్తామని కూటమి నాయకులు ప్రారంభంలో హడావుడి చేశారు. అయితే ఇంత వరకూ వక్క మార్కెట్ ఏర్పాటు చేయలేదు.

మడకశిర నియోజకవర్గంలో ప్రధాన వాణిజ్య పంటలు	చింతపండు, వక్క, తమలపాకు, పట్టుగూళ్లు, పూలు
మల్బరీ రైతుల సంఖ్య	12,500
చింత రైతుల సంఖ్య	20,200
వక్క రైతుల సంఖ్య	6,500
తమలపాకు రైతుల సంఖ్య	2,200
పూల రైతుల సంఖ్య	2,100

పట్టుగూళ్లు, చింత రైతులకూ...

నియోజకవర్గంలో చింతపండు, తమలపాకు, పట్టుగూళ్ల ఉత్పత్తి కూడా అధికం. ఏటా రూ.8 కోట్ల విలువ చేసే చింతపండుతో పాటు రూ. కోట్ల విలువైన తమలపాకు, రూ. 20 కోట్లకు పైగా పట్టుగూళ్ల ఉత్పత్తి ఉంటోంది. జిల్లాలోనే ఈ పంటల ఉత్పత్తి కేవలం మడకశిర నియోజకవర్గంలోనే ఉండడం గమనార్హం. అయితే స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేక పోవడంతో చింతపండు, తమలపాకు, పట్టుగూళ్లను హిందూపురం మార్కెట్‌కు తరలించి అమ్ముకోవాల్సి వస్తోంది. పూల సాగు రైతులు సైతం కర్ణాటకలోని బెంగళూరు, తుమకూరు, శిర, మహారాష్ట్రకు తరలించి అమ్ముకుంటున్నారు. ఫలితంగా రవాణా ఖర్చులను అధికంగా భరించాల్సి వస్తోంది.

మార్కెట్ యార్డు నిరుపయోగం..

మడకశిర కేంద్రంగా ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డు నిరుపయోగం మారింది. యార్డు అభివృద్ధికి అన్ని వనరులు ఉన్నా పాలకుల నిర్లక్ష్యంతో వృథాగా మారింది. మడకశిర మార్కెట్ యార్డుకు రావాల్సిన ఆదాయం కళ్లెదుటే హిందూపురం మార్కెట్‌కు పోతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడిచినా వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఇంత వరకూ పాలకవర్గాన్ని నియమించలేదు.

మార్కెట్ సౌకర్యం కల్పించాలి



వ్యవసాయోత్పత్తులకు ప్రభుత్వం స్థానికంగానే మార్కెట్ సౌకర్యం కల్పించాలి. పట్టుగూళ్లు, చింతపండు, పూలు, వక్కను అధికంగా ఉత్పత్తి చేస్తున్నా స్థానికంగానే మార్కెట్ సౌకర్యంలేక ఇబ్బందులు పడుతున్నాం. వక్కకు కర్ణాటకలో మాత్రమే మార్కెట్ సౌకర్యం ఉంది. ఫలితంగా రవాణా ఖర్చులను అధికంగా భరించాల్సి వస్తోంది.

– శ్రీనివాస్, హెచ్‌టీ హళ్లి, రొళ్ల మండలం

దళారులతో తీవ్ర నష్టం



మడకశిర ప్రాంతంలో వక్కకు మార్కెట్ సౌకర్యం లేదు. దీంతో కర్ణాటకకు తరలించి అమ్ముతున్నాం. అక్కడికి సరుకు తీసుకెళ్లాలంటే రవాణా ఖర్చులు ఎక్కువగా వస్తున్నాయి. అంతేకాక దళారులు కుమ్మక్కై తక్కువ ధరకు పంటను కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే అమరాపురంలో వక్క మార్కెట్‌ను వెంటనే ప్రారంభించాలి.

– రాజప్ప, ఇనగలూరు, అగళి మండలం

ముగ్గురిపై రౌడీ షీట్

కదిరి టౌన్: యువకుడిపై దాడి చేసి బలవంతంగా ద్విచక్ర వాహనాన్ని లాక్కెళ్లిన ముగ్గురిపై రౌడీషీట్ తెరిచినట్లు కదిరి సీఐ నారాయణరెడ్డి తెలిపారు. వివరాలను మంగళవారం ఆయన వెల్లడించారు. కదిరి పట్టణానికి చెందిన కళ్యాణ్, జునైద్, బాబా ఫక్రుద్దీన్ స్నేహితులు. గతంలో స్థానిక టీటీడీ కల్యాణమంటపం వద్ద పార్కింగ్ బాయ్‌గా పనిచేస్తున్న సోమశేఖరరెడ్డిపై వీరు దాడికి పాల్పడ్డారు. హతమారుస్తామని బెదిరించి అతని ద్విచక్ర వాహనాన్ని లాక్కెళ్లారు. గతంలోనూ వీరు పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారు. నేర ప్రవృత్తిని వీడక పదేపదే దౌర్జన్యాలకు పాల్పడుతుండడంతో ముగ్గురిపై రౌడీ షీట్ తెరిచినట్లు పోలీసులు తెలిపారు.

ప్రాంగణ నియామకాల్లో 40 మంది ఎంపిక

అనంతపురం సెంట్రల్: ఎస్కేయూలోని పాలిమర్ సైన్స్ సెమినార్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో మొత్తం 40 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు దక్కాయి. బయాలజికల్ ఇంజినీరింగ్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటర్వ్యూలకు మొత్తం 186 మంది విద్యార్థులు హాజరయ్యారు. దశలవారీగా నిర్వహించిన ఇంటర్వ్యూల ప్రక్రియలో 78 మంది తుది దశకు చేరుకున్నారు. వీరిలో ప్రతిభ చాటిన 40 మందికి ఆఫర్ లెటర్లను కంపెనీ ప్రతినిధులు అందజేశారు. ముఖ్యఅతిథిగా వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య అనిత హాజరు కాగా, రెక్టార్ ఆచార్య వెంకటనాయుడు, ప్రొఫెసర్లు నరసింహన్, రమేష్ బాబు, రమణ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ సోమశేఖర్, ఫ్యాకల్టీ జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

పరువు పోతోందని బాలిక ఆత్మహత్యాయత్నం

అగళి: ప్రేమ వ్యవహారంలో చిక్కుకున్న ఓ బాలిక... కుటుంబ పరువు పోతోందని భావించి ఆత్మహత్యాయత్నం చేసింది. పోలీసులు తెలిపిన మేరకు.. అగళి మండలం జంగమరపల్లి గ్రామానికి చెందిన రమేష్ చిన్న కుమార్తె అమూల్య (17) పదో తరగతి వరకూ చదువుకుని ఇంటి పట్టునే ఉంటోంది. ఈ క్రమంలో కుటుంబసభ్యులతో కలసి రోజూ గొర్రెలు కాసేందుకు వెళుతుండేది. కొంత కాలంగా ఓ వ్యక్తితో ప్రేమలో పడిన బాలిక... తమ పెళ్లికి ఇంట్లో పెద్దలు ఒప్పుకోరని భావించి ఇల్లు విడిచి అతనితో పాటు వెళ్లిపోయింది. ఘటనపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున అమూల్య సోమవారం ఇంటికి చేరుకుంది. అనంతరం ప్రేమ వ్యవహారంపై పెద్దల సమక్షంలో పంచాయితీ చేసి, ప్రేమికులను మందలించి ఎవరి ఇళ్లకు వారిని పంపించారు. దీంతో క్షణికావేశానికి లోనైన అమూల్య.. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో శరీరంపై పెట్రోల్ పోసుకుని దుప్పటి కప్పుకుని ఇంటి బయటకు వచ్చి నిప్పు పెట్టుకుంది. చుట్టుపక్కల వారు గమనించి మంటలు ఆర్పే లోపు శరీరం చాలా వరకూ కాలిపోయింది. కుటుంబసభ్యులు వెంటనే బెంగళూరులోని ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వీరేష్ బెంగళూరుకు వెళ్లి బాధితురాలితో మాట్లాడారు. ఇంటి పరువు పోతుందని భావించి తానే స్వయంగా ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు బాధితురాలు తెలిపినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

చెట్లు దగ్ధం

అగళి: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో విలువైన ఫలసాయం చెట్లు కాలి పోయాయి. వివరాలు... అగళి మండలం దొక్కలపల్లికి చెందిన రైతు తిమ్మప్ప... హునిసేకుంట మార్గంలో తనకున్న 4 ఎకరాల్లో ఎనిమిదేళ్ల క్రితం చింత, వేప, సపోట, నిమ్మ చెట్లను సాగు చేశాడు. సోమవారం రాత్రి ఆ పొలానికి సమీపంలో ఉన్న బీడు భూమిలో ఎండుగడ్డికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేశారు. దీంతో మంటలు చెలరేగి 100 చింత, 80 వేప, 15 సపోట, 10 నిమ్మ చెట్లు, బిందు సేద్యం పరికరాలు కాలిపోయాయి. ఘటనతో రూ.5 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న పీఎస్‌యూ జాతీయ కార్యదర్శి మహమ్మద్ షఫీవుల్లా

ధర్మవరం: బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని ప్రోగ్రెసివ్ స్టూడెంట్ యూనియన్ (పీఎస్‌యూ) జాతీయ కార్యదర్శి మహమ్మద్ షఫీవుల్లా డిమాండ్ చేశారు. పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర అధ్యక్షతన ఆ శాఖ రాష్ట్ర మూడో మహాసభలు మంగళవారం ధర్మవరంలోని ఎన్జీఓ హోంలో ప్రారంభమయ్యాయి. అంబేడ్కర్ సర్కిల్ నుంచి ఎన్జీఓ హోం వరకూ విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మహమ్మద్ షఫీవుల్లా మాట్లాడారు. అటు కేంద్రం, ఇటు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు విద్యా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని మండిపడ్డారు. విద్యా సంవత్సరం ముగింపు దశకు చేరుకుంటున్నా ఇప్పటి వరకూ తల్లికి వందనం, స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ విద్యార్థులకు మెస్ ఛార్జీ బిల్లులు విడుదల చేయకుండా పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానంతో ప్రభుత్వ విద్య పూర్తిగా నాశనమవుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగానికి కేటాయించిన బడ్జెట్ సరిపోదని, కనీసం 30శాతం బడ్జెట్ కేటాయించి ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌ఎస్‌పీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ... వెనుకబడిన రాయలసీమ జిల్లాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేసి తాగు, సాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు. పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడుతూ.. ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో నిర్వహించబోయే పీజీ సెట్‌ను రద్దు చేయాలన్నారు. మహాసభలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల ప్రతినిధులు చంద్ర, నరసింహ, నందకిషోర్, సురేష్, భాస్కర్, అయ్యన్న, చైతన్య, కేశవ, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

స్పిన్నింగ్ మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకోండి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఫ్రీ కాట్‌బీ స్పిన్నింగ్ మిల్లు కార్మికులు

ప్రశాంతి నిలయం: కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న పరిగి మండలం కొడిగెనహళ్లి పంచాయతీ పరిధిలో ఉన్న ఫ్రీ కాట్ 'బి' స్పిన్నింగ్ మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలంటూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఆ పరిశ్రమ కార్మికులు ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జెడ్పీ శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ.. 1983లో స్థాపించిన ఈ మిల్లులో ప్రస్తుతం 600 మంది కార్మికులు 35 సంవత్సరాలుగా పనిచేస్తున్నారన్నారు. కంపెనీ లాభాల్లో నడుస్తూ అనేక అనుబంధ సంస్థలను నెలకొల్పిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి కానీ, గుర్తింపు పొందిన కార్మిక సంఘానికి గాని ఎలాంటి కారణాలు తెలపకుండా ఈ నెల 9న ఉన్నఫలంగా కంపెనీని మరో ప్రాంతానికి తరలించే ప్రయత్నాలను యాజమాన్యం చేపట్టిందన్నారు. ఉత్పత్తిని ఆపేసి నో వర్క్ నో పే అంటూ సంస్థను లాక్‌డౌన్ చేసేందుకు సిద్ధమైందన్నారు. దీంతో కార్మిక కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్ స్పందించి కార్మికుల సంక్షేమం దృష్ట్యా మిల్లు తరలింపును అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఆర్వో విజయ సారథికి అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, కోశాధికారి సందీప్, నాయకులు సదాశివ రెడ్డి, శివకుమార్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బండల ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



బస్సు ఢీకొనడంతో బోల్తాపడిన ట్రాక్టర్ ట్రాలీ

తాడిపత్రి రూరల్: బండల ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో పలువురు గాయపడ్డారు. సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపిన మేరకు.. మంగళవారం బుగ్గ నుంచి తాడిపత్రి వైపు బండల లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ వెంకటరెడ్డిపల్లి వద్దకు చేరుకోగానే వెనుకనే వేగంగా దూసుకొచ్చిన బనగానపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. బండలు చెల్లాచెదురుగా పడి ముక్కలయ్యాయి. ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ గురుమూర్తి కాలు విరిగింది. ప్రయాణికులు ఎం.లక్ష్మీదేవి, వెంకటరాముడు, లక్ష్మీదేవి, కృష్ణయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రోడ్డుకు అడ్డంగా పడిన బండలను తొలగించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి వృషభాల బలప్రదర్శన



రాతి దూలాన్ని లాగుతున్న వృషభాలు

పామిడి: మండలంలోని వంకరాజుకాలవ గ్రామ సమీపంలో పెన్నప్పగుడి వద్ద వెలసిన ఎర్రితాత, ఫక్కీరప్ప స్వాముల ఆలయ 24వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం రెండో రోజు నిర్వహించిన రాష్ట్ర స్థాయి వృషభాల బల ప్రదర్శన హోరాహోరీగా సాగింది. అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ జిల్లాలకు చెందిన 10 జతల వృషభాలను రైతులు తీసుకువచ్చారు. అనంతపురం జిల్లా అక్కంపల్లికి చెందిన రైతు ఇంద్రారెడ్డి వృషభాలు ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నాయి. తాడిపత్రికి చెందిన రాజశేఖర్‌రెడ్డి బ్రదర్స్ వృషభాలు ద్వితీయ, నంద్యాల జిల్లా డి.రంగాపురం, మల్లెల గ్రామాలకు చెందిన ఎస్‌ఎస్‌వీ ట్రేడర్స్, రామకృష్ణారెడ్డి వృషభాలు తృతయ స్థానాన్ని, కర్నూలు జిల్లా పి.రుద్రవరం, డి.రంగాపురం గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి, ఎల్లాగౌడ్ వృషభాలు నాల్గో స్థానాన్ని,, మల్లెల గ్రామానికి చెందిన శేషయ్య జోగులు వృషభాలు 5 స్థానాన్ని రంగాపురం, తిప్పారెడ్డిపల్లికి చెందిన రైతులు రామకృష్ణారెడ్డి, దేవేంద్రరెడ్డి వృషభాలు ఆరో స్థానాన్ని, పెద్దవడుగూరు మండలం లక్షుంపల్లి గ్రామ రైతు శివారెడ్డి వృషభాలు 7 స్థానం, శింగనమల మండలం కల్లుమడి గ్రామానికి చెందిన రైతు నిఖిల్ వృషభాలు 8వ స్థానం, చిన్నకోడాయపల్లికి చెందిన రైతులు రాజు, రాజమోహన్ వృషభాలు 9 స్థానం, సిద్ధరాంపురం రైతు ఈశ్వరయ్య వృషభాలు 10 స్థానంలో నిలిచాయి. విజేత వృషభాల రైతులను అభినందిస్తూ నగదు పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు. కాగా, పోటీల్లో భాగంగా బుధవారం ఆరుపళ్ల విభాగంలో వృషభాల బలప్రదర్శన ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

మనవాళ్లే వదిలేయండి!

- మద్యం రవాణా, నాటుసారా తయారీ దారులకు కూటమి నేతల మద్దతు
- కేసులు కట్టకుండా వదిలేయాలని ఎక్సైజ్ అధికారులపై ఒత్తిడి



పుట్టపర్తి టౌన్: అక్రమ మద్యం రవాణా, నాటుసారా తయారీ కేసుల్లో పట్టుబడిన వారికి కూటమి నాయకులు అండగా నిలుస్తున్నారు. కేసులు కట్టకుండా వదిలేయాలని ఎక్సైజ్ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో ఏం చేయాలో తెలియని అధికారులు తప్పనిసరి పరిస్థితుల్లో నాయకుల అనుచరులను వదిలేస్తున్నారు. పుట్టపర్తిలో సోమవారం చోటుచేసుకున్న సంఘటనే ఇందుకు ఉదాహరణగా నిలిచింది.

నారాయణప్పకు బెయిల్...

నారాయణమ్మపై కేసు సోమవారం సాయంత్రం అనంతపురం నుంచి వచ్చిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు పుట్టపర్తి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బుక్కపట్నం, నార్శింపల్లి తండా ఏరియాల్లో దాడులు చేశారు. జానకంపల్లి గ్రామానికి చెందిన నారాయణప్ప వద్ద వివిధ రకాల బ్రాండ్లకు సంబంధించి 13 మద్యం బాటిళ్లు, నార్శింపల్లి తండాకు చెందిన నారాయణమ్మ వద్ద మూడు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని నిందితులను పుట్టపర్తి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. జానకంపల్లి గ్రామానికి చెందిన నారాయణప్ప అధికార పార్టీ మద్దతుదారుడు కావడంతో కూటమి పార్టీ నాయకులు ఎక్సైజ్ అధికారులకు ఫోన్ చేసి "మనవాడే వదిలేయండి" అంటూ ఒత్తిడి తెచ్చారు. దీంతో అధికారులు నారాయణప్పకు స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపేశారు. కానీ నార్శింపల్లి తండాకు చెందిన నారాయణమ్మను మాత్రం రాత్రంతా స్టేషన్‌లో ఉంచారు. విషయం తెలుసుకున్న నార్శింపల్లి తండా సర్పంచ్ భర్త భాస్కర్ నాయక్ స్టేషన్‌కు చేరుకొని ఎక్సైజ్ అధికారులతో వాగ్వాదం చేశారు. 13 బాటిళ్లు దొరికిన నారాయణప్పను వదిలేసి... కొంత సారాతో దొరికిన మహిళను మాత్రం రాత్రంతా స్టేషన్‌లో ఉంచి కేసు నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో దిగొచ్చిన ఎక్సైజ్ అధికారులు ఆమెకు కూడా స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారు. దీనిపై ఎక్సైజ్ ఎస్‌ఐ ఉమామహేశ్వర్‌రాజును వివరణ కోరగా... నారాయణప్ప వద్ద ప్రభుత్వం అనుమతి ఉన్న మద్యం దొరకడంతో స్టేషన్ బెయిల్ ఇచ్చామని, నాటుసారా తయారీకి అనుమతులు లేకపోవడంతో కేసు నమోదు చేశామని తెలిపారు. ఇందులో ఎలాంటి రాజకీయ ఒత్తిడి లేదన్నారు. అయితే ఒక మహిళను రాత్రంతా స్టేషన్‌లో ఉంచడంపై మాత్రం సమాధానం చెప్పేందుకు ఇష్టపడలేదు.

పాహి పాహి పరమేశ్వరా!

- లేపాక్షిలో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- ఐదు రోజుల పాటు నిర్వహణ



పూజలో పాల్గొన్న ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్, గ్రామ పెద్దలు

లేపాక్షి:

సాంబశివ... శంభోశంకర శరణం
మే తవ చరణయుగం
శివాయ నమహో: నమహా..
ఓం నమ శివాయః

.... అంటూ ఆ మహాదేవుడిని స్మరించగానే సకల అభీష్టాలు నెరవేరుతాయని ప్రతీతి. అభిషేక ప్రియుడైన ఆదిదేవుడిపై కాసిన్ని నీళ్లు పోస్తే చాలు సంతోషించి సకల ఐశ్వర్యాలను ప్రసాదిస్తాడని శాస్త్రాలు చెబుతున్నాయి. మహా శివరాత్రి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శైవ క్షేత్రాలు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకోగా... పురాతన శైవక్షేత్రాల్లో ఒకటైన లేపాక్షిలోని వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఐదు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, దేవదాయ శాఖ అధికారులు పూర్తి చేశారు. మంగళవారం ఉదయం ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ నేతృత్వంలో వేదపండితుడు సునీల్‌శర్మ ఆధ్వర్యంలో మహా గణపతి, సుదర్శన హోమాలు, అభిషేకార్చనలు పెద్ద ఎత్తున జరిగాయి. సాయంత్రం గ్రామోత్సవం నేత్రపర్వంగా సాగింది. రాత్రికి ధ్వజారోహణంతో ఉత్సవాలకు అంకురార్పరణ చేశారు. ఈ సందర్భంగా కరణం రమానందన్ మాట్లాడుతూ... ప్రపంచ పర్యాటక కేంద్రంగా ఖ్యాతిగాంచిన లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయానికి ఎంతో ప్రాశస్త్యముందని, ఈ నేపథ్యంలో ఇక్కడ నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు ఉమ్మడి జిల్లాలోని భక్తులతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారన్నారు. ఉత్సవాలకు తరలివచ్చే ఏ ఒక్క భక్తుడూ అసౌకర్యానికి గురికాకుండా పటిష్ట ఏర్పాట్లు చేశామన్నారు. 26న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాత్రి జాగరణకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలతో పాటు శాస్త్రీయ నృత్యాలు ఉంటాయన్నారు. స్థానిక కళాకారులకు ప్రాధాన్యతనిస్తూ ఇతర ప్రాంతాలకు చెందిన వారిని సైతం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. 27న బ్రహ్మరథోత్సవం, 28న రాత్రి పూలపల్లకీ ఉత్సవం, మార్చి 1వ తేదీన వసంతోత్సవాలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని దేవుడి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న వీరభద్రస్వామి మూలవిరాట్

అన్ని ఏర్పాట్లు చేశాం

శివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులు, ప్రజలు ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. భక్తుల రద్దీని దృష్టిలో ఉచంఉకుని ప్రత్యేకంగా బారికేడ్లతో పాటు వలంటీర్లనూ ఏర్పాటు చేశాం.

– నరసింహమూర్తి, ఆలయ కార్యనిర్వహణాధికారి, లేపాక్షి